క్లుప్తంగా

నేడు శ్రీరాముడికి పట్టువస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే

రాజంపేట : శ్రీరామనవమి సందర్భంగా గురువారం ఏకశిలా నగరంలోని ఒంటిమిట్ట కోదండరాముడికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించినున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు సతీసమేతంగా ఆలయానికి ఎమ్మెల్యే వెళ్లనున్నట్లు పేర్కొంది. కార్యక్రమానికి నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, భక్తులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

1న ఆసరా మండలస్థాయి కార్యక్రమం

రాయచోటి అర్బన్ : వైఎస్ఆర్ ఆసరా పథకంపై ఏప్రిల్ 1వ తేదీన రాయచోటి పట్టణంలో మండలస్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3వ విడత వైఎస్ఆర్ ఆసరా పథకం నిధుల పంపిణీపై సమావేశం జరుగుతుందన్నారు. సుండుపల్లె మార్గంలోని నారాయణ కల్యాణ మండలంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహణ ఉంటుందన్నారు. సమావేశానికి శాసనమండలి వైస్ చైర్మన్ జకియాఖానం, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారంటూ తెలిపారు.

నేరపూరిత రాజకీయాల్లో టీడీపీనే దిట్ట

సిద్దవటం : రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న అభిమానాన్ని ఓర్చుకోలేని టీడీపీ ఏదో విధంగా ప్రభుత్వంపై బురదజల్లేందుకు దుష్ప్రచారాలను ఎంచుకుందని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చింతకుంట రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డిలు ఆరోపించారు. ఇటీవల జంగాలపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై టీడీపీ చేస్తున్న దిగజారుడు ఆరోపణలపై విలేకరులతో మాట్లాడారు. పార్టీలకతీతంగా సంక్షేమ అందిస్తున్న ప్రభుత్వం తమదని తెలిపారు. ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. నీతిలేని, నేరపూరిత రాజకీయాలు చేయడంలో టీడీపీనే దిట్ట అని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీపై నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెప్తారని హితవుపలికారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల యూత్ కన్వీనర్ ఆలం క్రిష్ణచైతన్య, పార్టీ నాయకులు నిమ్మకాయల ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

గాలివీడు : విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గాలివీడు సర్పంచ్ లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఎంపీడీఓ శేఖర్ నాయక్‌తో కలిసి సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పది పబ్లిక్ పరీక్షలకు హాజరుకాబోయే విద్యార్థులు ప్రణాళికబద్ధంగా సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాలివీడు వైద్యాధికారిణి రాధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభతో ఉపాధి అవకాశాలు

చిన్నమండెం : విద్యార్థులు తమ ప్రతిభతో ఉపాధి అవకాశాలు పొందాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ తరువాత ఎలాంటి నిర్ణీత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని వాటిని ఎలా సాధించాలనే అంశంపై రీసోర్స్ పర్సన్‌ల బృందం విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పీఓ నాగనవీన్‌కుమార్, కెరీర్ ప్లానింగ్ రీసోర్స్ టీం శారద, సుబ్బరాయుడు, శివ, రామరాజు, ఇక్బాల్, రామ్మోహన్, సబీహ, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట, జ్యోతి, గొల్లపల్లె, చలమారెడ్డిపల్లె, వెంకటయాపల్లె గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు.

మృతుడి కుటుంబానికి ఏపీఎండీసీ పరిహారం

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు పట్టణంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏపీఎండీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వడ్డిబాల కుటుంబానికి ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి రూ. 10 లక్షలు పరిహారాన్ని ప్రకటించినట్లు సీపీఓ వెంకటరమణ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీ విజయవాడ హెడ్ ఆఫీసులో వడ్డిబాల అవుట్ సోర్సింగ్ ప్రకారం విధులు నిర్వహించేవారని, ప్రమాదంలో మృతి చెందడంతో ఏపీఎండీసీ యాజమాన్యం ఈ పరిహారం ప్రకటించినట్లు ఆయన చెప్పారు. బుధవారం మృతదేహాన్ని రైల్వేకోడూరులోని చియవరం గ్రామంలో వడ్డి బాల ఇంటికి తీసుకురాగా పలువురు ఏపీఎండీసీ ఉద్యోగులు నివాళి అర్పించారు.

అర్హత ఉన్నవారందరికీ ఇళ్ల పట్టాలు

- వరిగలో లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇళ్ల పట్టాల పంపిణీ
- మార్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


రాయచోటి టౌన్: లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు


రాయచోటి: మెగా మార్ట్ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : పేదలకు సొంతింటి కలను సీఎం జగన్ నిజం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి రూరల్ పరిధి వరిగ గ్రామంలోని జగనన్న లే అవుట్‌లో ఆ గ్రామ సర్పంచ్ కసిరెడ్డి సుబ్బలక్ష్మమ్మ, కౌన్సిలర్ వెంకట నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి అధ్యక్షతన లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని 133 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేనిపేదలు ఉండకూడదని మహోన్నత ఆశయంతో సీఎం జగన్ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలతో పాటు ఇళ్లు నిర్మాణానికి కూడా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు, బీసీ నాయకుడు పల్లపు రమేష్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకట్రామిరెడ్డి, సహదేవరెడ్డి, బాబు, సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, శ్రీనివాసులు, చంద్రహాస్ పాల్గొన్నారు.

మార్ట్ ప్రారంభోత్సవంలో..

రాయచోటి : రాయచోటిలో వాణిజ్య మెగా మార్ట్‌లు ఏర్పాటవుతుండటం హర్షణీయమని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లు అన్నారు. బుధవారం రాయచోటి పట్టణం మాసాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ మెగా మార్ట్ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ గిరీషాతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి మన్ననలను పొందాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, ఆసీఫ్ అలీఖాన్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, మదన్‌మోహన్‌రెడ్డి, సుగవాసి శ్యామ్, ఫయాజ్ అహమ్మద్, గౌస్‌ఖాన్, పల్లా రమేష్, జానం రవీంద్రయాదవ్, మనం సేవా సంస్థ అధ్యక్షుడు ప్రకాష్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జాఫర్ అలీఖాన్, జావీద్, అమీర్ పాల్గొన్నారు.

అదనపు సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని ప్రధాన కూడళ్లలో అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు తాను కృషి చేస్తానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అర్బన్ పోలీస్ స్టేషన్‌లోని సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన తరువాత సంతృప్తి వ్యక్తం చేస్తూ అదనంగా మరో రూ.5లక్షల నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ శ్రీధర్, అర్బన్ సీఐ సుధాకరరెడ్డి, ఎస్ఐలు నరసింహారెడ్డి, ఇనయతుల్లా, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మదనపల్లె పరిశీలకుడు హబీబుల్లాఖాన్, మదన్‌మోహన్‌రెడ్డి, ఆసీఫ్ అలీఖాన్, దిన్నెపాడు రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల పార్కు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు కృషి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని కొత్తపేట రామాపురంలో ఉన్న డైట్ హాస్టల్ ప్రాంగణంలో చిన్నపిల్లల పార్కు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి డైట్‌హాస్టల్ మైదానంలో కలియతిరిగారు. త్వరలోనే మైదానంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు చిన్నపిల్లల పార్కు, మొక్కల పెంపకం, బల్లల ఏర్పాటు తదితరాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

రాయల్టీ పేరుతో చేతివృత్తుల వారిని ఇబ్బంది పెట్టకండి

రాయచోటి : రాయల్టీ పేరుతో రాళ్లు కొట్టుకునేవారిని, చేతివృత్తుల వారిని ఇబ్బంది పెట్టొద్దని మైనింగ్ అధికారులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. బుధవారం రాయచోటిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమెల్యే మాట్లాడుతూ నూతన రాయల్టీ పేరుతో కొన్ని ప్రైవేటు సంస్థలు చేతి వృత్తులు, వడ్డెరులు, రాళ్లు కొట్టుకునే వారిపైన రాయల్టీ పేరున ఒత్తిడి చేయడంపై స్పందించారు. రాళ్లు కొట్టుకునేవారిపైన, ఇళ్ల నిర్మాణానికి ఇసుక తోలుకునే వారిని బెదిరించడం సరికాదన్నారు. రాయల్టీ వలన పెంచిన కంకర, మెటల్ రేట్లను వెంటనే తగ్గించాలని ఆయన స్టోన్ క్రషర్ యజమానలను కోరారు.

రేపు గాలివీడుకు ఎమ్మెల్యే

గాలివీడు : ఈనెల 31వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు గాలివీడు ప్రభుత్వ పాఠశాలలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అనంతరం గాలివీడు సచివాలయం- 2ను ప్రారంభించనున్నారని ఎంపీడీఓ శేఖర్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, ప్రభుత్వ అధికారులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చెప్పారు.

ఖర్చుకు కచ్చితమైన లెక్కలుండాలి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ నిధుల ఖర్చులో ప్రతి రూపాయికి జవాబుదారీతనం ఉండాలని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2023- 24 మున్సిపల్ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదం తెలిపారు. 2022- 23 ప్రారంభ నిల్వ రూ.15.28 లక్షలు ఉండగా, జమలు రూ.45.10 కోట్లు కాగా, ఖర్చులు రూ.43.44లక్షలు కాగా మిగులు రూ.16.91 కోట్లు ఉన్నట్లు తెలిపారు. 2023- 24 ఏడాదికి గాను ప్రారంభ నిల్వ రూ.16.91 కోట్లు, జమలు రూ.47.13 కోట్లు, ఖర్చులు రూ.47.19 కోట్లుగాను, మిగులు రూ.16.84 కోట్లు ఉంటుందంటూ అంచనా వేశామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పాలకవర్గం మున్సిపల్ ఆదాయం పెంపునకు మరింతగా కృషి చేయాలన్నారు. ప్రతి రూపాయి ఖర్చుకు కచ్చితమైన లెక్కలు చూపాలన్నారు. మున్సిపల్ పరిధిలో చేపట్టే అత్యవసర పనులకు నిధులు మంజూరు చేయించే బాధ్యత తనది అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా రూ. 1.17 కోట్లతో నిర్మిస్తున్న సభా భవనం నిర్మాణ పనులు 6నెలలో పూర్తి చేయిస్తామన్నారు. అదనంగా మరో రూ.1.15 కోట్లతో సభాభవనంలో ఫర్నీచర్, సెంట్రల్ లైటింగ్, ఏసీలను పొందుపరచనున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న రాయచోటిని ఆదాయం పెరిగినందున స్పెషల్ గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలంటూ అధికారులను ఆదేశించారు. రైతుల వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం మున్సిపల్ పరిధిలో ఎలాంటి గేటు వసూలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 11 వార్డులలో నిర్వహించిన గడపగడప కార్యక్రమంలో ప్రజలు తెల్పిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ గంగాప్రసాద్, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీదేవికి పూజలు


పూజలందుకున్న మంగళ గౌరీదేవి

సిద్దవటం : మండలంలోని మాధవరం- 1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళ గౌరీదేవి అమ్మవారికి బుధవారం భక్తిశ్రద్ధలో పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి మండలాభిషేకంలో భాగంగా బుధవారం 41 రోజు కావడంతో అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తదనంతరం అమ్మవారికి నవగ్రహ సహిత అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాభిషేకం, నిర్వహించి పూలతో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

చలివేంద్రం ప్రారంభం

ఓబులవారిపల్లె : వేసవితాపంతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో సర్పంచ్ ఎస్‌పీ జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి భారతీ చలివేంద్రాన్ని ప్రారంభించి పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి కాలం ముగిసే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కృష్ణమూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ భార్గవి, డిజిటల్ అసిస్టెంట్ కిరణ్, వ్యవసాయ సిబ్బంది మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో..

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురం గ్రామంలో బుధవారం సర్పంచ్ వెలగచర్ల సుజాత ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రతిరోజు శుభ్రమైన నీటిని ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, శివయ్య స్వామి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత భూముల పరిరక్షణకు చర్యలు

ఎస్సీ సెల్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాజంపేట : డివిజన్ పరిధిలో దళితుల భూములను ఎవరైనా ఆక్రమిస్తే తన దృష్టికి తీసుకురావాలని రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం సబ్‌కలెక్టర్ చాంబరులో డివిజన్ ఎస్సీ సెల్ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు సంబంధించిన భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. దళితుల భూములకు సంబంధించి ఫిర్యాదులు అందింటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యకమంలో రాజంపేట డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, సీఐ నరసింహారావు, ఏఓ శిరీష, తహసీల్దారు ముద్దా సుబ్రమణ్యం రెడ్డి, డివిజన్ ఎస్సీసెల్ మానటరింగ్ కమిటీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, సురేష్, జెడ్పీటీసీలు దాసరి ప్రశాంతి, ఉదయగిరి సుబ్బరాయుడు, పాలెం రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా సమావేశంలో పలువురు సభ్యులు దళితులకు సంబంధించి భూ సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అన్నింటిని నిబంధనల మేరకు పరిష్కరిస్తామని వారికి సబ్‌కలెక్టర్ భరోసా ఇచ్చారు.

రాహుల్‌పై అనర్హతవేటు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు


మాట్లాడుతున్న పీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనాథ్

రాజంపేట రూరల్ : ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, వాయనాడ్ ఎంపీ రాహుల్‌గాంధీపై అనర్హతవేటు వేయటం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని ఏపీసీసీ కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్ మండిపడ్డారు. స్థానిక ఆర్అండ్‌బీలో బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి శ్రీనాథ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ, అదానీ చీకటి కుంభకోణాలను రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రశ్నించటం వలనే అనర్హత వేటు వేశారనే విషయాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలియజేశారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు ప్రజలలో వచ్చిన స్పందనకు మోడీలో భయం ఏర్పడిందని ఆరోపించారు. తక్షణమే అనర్హత వేటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అహ్మద్, పాండురంగయ్య, సుబ్రమణ్యం, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో దంత వైద్య శిబిరం

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 215 మందికి పరీక్షలు నిర్వహించినట్లు కమాండెంట్ ఎన్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తిరుపతి ఫిరోజ్ డెంటల్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ ఫిరోజ్ బాబు, డాక్టర్ చాందిని బెటాలియన్‌లోని పోలీసు కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు 215 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంట్లు పి.ఎస్.డి. ప్రసాద్, కె. వెంకట్‌రెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది, యూనిట్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జన సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యం

- సంక్షేమ పథకాల అమలులో మహిళలకే అగ్రతాంబులం
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


పుల్లంపేట: మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

పుల్లంపేట : జన సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం 483 గ్రూపులకుగాను రూ. 4.19 కోట్ల మెగా చెక్‌ను లబ్ధిదారులకు ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అందజేశారు. మహిళల కళ్లల్లో ఆనందాన్ని నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకు అగ్రతాంబులం ఇస్తున్నామన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతిని సాధించాలని సూచించారు. అందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలంటూ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపీపీ జయశంకర్ నాయుడు, జెడ్పీటీసీ రామనాథం, ఎంపీటీసీ సుబ్బరాయుడు, సుదర్శన్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శంకర్ రెడ్డి, నలినికాంత్ రెడ్డి, మణికంఠ, జేసీఎస్ కన్వీనర్ హరినాథ్ రెడ్డి, పుల్లంపేట సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, పిచ్చిరెడ్డి, ఎంపీడీఓ ప్రకాశం, ఎంఆర్ఓ నరసింహులు, రైల్వేకోడూరు వెలుగు ఏరియా అధికారి వెంకటేశ్వర్లు, ఏపీఎం వెంకటలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుండాల్ రెడ్డికి ఎమ్మెల్యే నివాళి

చిట్వేలి : వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు పెద్దగుండాల్ రెడ్డి (50) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పెద్దగుండాల్ రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్కా మధుసూదన్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎల్‌వీ మోహన్ రెడ్డి, కుమార్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, తల్లెం భరత్ కుమార్ రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

'ఖాకీ'ల ఇఫ్తార్ విందు

నందలూరు(రాజంపేట) : నందలూరు ఏఎస్ఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా స్థానిక మసీదులో ముస్లిం ప్రార్థనలు ముగిసిన అనంతరం ఏఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి వారితో కలిసి ప్రార్థనలు చేశారు.


ఫలహారం అందజేస్తున్న ఏఎస్ఐ శంకర్‌నాయక్

ఆకట్టుకున్న 'హిడింబాసుర వధ'


నాటకాన్ని వివరిస్తున్న భాగవతారిణి శారద


మహాభారత యజ్ఞాన్ని వీక్షిస్తున్న ప్రజలు

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె సత్రం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా బుధవారం హిడింబాసుర వధ కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రముఖ భాగవతారిణి శారదచే హిడింబాసుర వధ, ద్రౌపదీ స్వయంవరం హరికథ పారాయణం నిర్వహించారు. ఈ మహాభారత యజ్ఞాన్ని వీక్షించడానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భాగవతారిణి మహాభారత కార్యక్రమాన్ని ప్రజలకు అర్థవంతంగా వివరించారు.



ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ రాముడు, శ్రీ ఆంజనేయస్వామి తోరణాలు


రామాలయం బలిపీఠం వద్ద దర్శనమిస్తున్న ప్రత్యేక పుష్పాలంకరణ

ఏకశిలా నగరంలో బ్రహ్మోత్సవ సందడి

శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలకు ఒంటిమిట్ట కోదండ రామాలయం ముస్తాబైంది. టీటీడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న ఏర్పాట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రంగురంగుల పూలతో ఆలయంలో అలంకరించగా, వెలుపుల విద్యుద్దీపాలంకరణ కనువిందు చేస్తోంది. రేపటినుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమవుతున్న బ్రహ్మోత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఏప్రిల్ 5న జరిగే కల్యాణానికి రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రితోపాటు ప్రముఖులు హాజరుకానున్నారు. – ఒంటిమిట్ట


సీఎం వచ్చే మార్గంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆహ్వాన పందిరి